ప్రభ మనం
TELUGU DAILY
RNI/APTEL/26/A3829
Gmail: prabhamanam@gmail.com
మంగళవారం 21-07-2026

# కల్లుకుంట -- చిన్న తుంబళం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం విజ్ఞప్తి



**పెద్దకడబూరు,జూలై,20,ప్రభ మనం:** మండలం,నుండి ఎమ్మిగనూరు నుంచి కల్లుకుంట, చిన్నతుంబళం గ్రామాలకు సరైన సమయంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అని సోమవారం సిపిఎం మండల కార్యదర్శి ఈ. తిక్కన్న మాట్లాడుతూ... ఎమ్మిగనూరు నుండి పెద్దకడుబూరు వెళ్లే ఆర్టీసీ బస్సును కల్లుకుంట, చిన్నతుంబళం గ్రామాల మీదుగా నడిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ప్రతిరోజూ ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల అధిక ఖర్చుతో పాటు భద్రతాపరమైన సమస్యలు కూడా ఎదురవుతున్నాయని వారు తెలిపారు. కల్లుకుంట, చిన్నతుంబళం గ్రామాల నుండి దాదాపు 100 మంది విద్యార్థులు పెద్దకడుబూరు మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్, ప్రైవేట్ పాఠశాలలు, అలాగే ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రతిరోజూ వెళ్లి చదువుకుంటున్నారు. సమయానికి బస్సు లేకపోవడంతో వారు ఆలస్యంగా విద్యాసంస్థలకు చేరుకోవాల్సి వస్తోందని, కొందరు చదువును కూడా మధ్యలో మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామాల ప్రజలు వైద్యం, ఉద్యోగాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మార్కెట్ అవసరాల కోసం కూడా ఎమ్మిగనూరుకు తరచూ ప్రయాణించాల్సి వస్తోంది. బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కావున ఎమ్మిగనూరు డిపో అధికారులు స్పందించి, ఎమ్మిగనూరు నుండి పెద్దకడుబూరు వెళ్లే ఆర్టీసీ బస్సును కల్లుకుంట, చిన్నతుంబళం మీదుగా నడిపించాలని, ముఖ్యంగా ఉదయం 7.30 గంటలకు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకునే విధంగా, సాయంత్రం 4.00 గంటలకు తిరుగు ప్రయాణానికి అనుకూలంగా బస్సు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయానికి ఎమ్మిగనూరు ఆర్టీసీ డిఎం మద్దిలేటి నాయుడు సానుకూలంగా స్పందించి త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే గ్రామాలలో సెప్టెంబర్ నెలలో సర్వీస్ ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈ. తిక్కన్న, సిఐటియు మండల కార్యదర్శి యు. ఈరన్న వినతిపత్రం సమర్పించారు.

# తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

రాస్తారోకోతో హెచ్చరించిన రైతు సంఘం నాయకులు

పంట బీమా విడుదల చేయాలి.. ప్రీమియం భారం ప్రభుత్వమే భరించాలి



**తుగ్గలి జూలై 20 (ప్రభ మనం,న్యూస్):** మండల కేంద్రమైన తుగ్గలి లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో తుగ్గలి మండలాన్ని వెంటనే 'కరువు మండలంగా' ప్రకటించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తుగ్గలి మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రగుడి భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల కార్యదర్శులు కొండారెడ్డి, శ్రీరాములు మాట్లాడారు. విత్తనాలు విత్తి 40 రోజులు దాటుతున్నా వర్షాలు పడకపోవడంతో వేరుశెనగ, పత్తి, జొన్న తదితర పంటలు క్షేత్రస్థాయిలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేపట్టిన రైతులు ఇప్పుడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని పేర్కొన్నారు.

రైతుల ప్రధాన డిమాండ్లు: ఉచిత పంట బీమా: 2024--25 సంవత్సరానికి సంబంధించిన పంట బీమా పరిహారాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రాబోయే ఖరీఫ్ పంట బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలి.

క్షేత్రస్థాయి పరిశీలన: ప్రత్యేక బృందాలతో మండలంలోని పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి కరువు నివేదిక సమర్పించాలి.

రుణాల రీషెడ్యూల్: సాగు కోసం తీసుకున్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు వడ్డీ మాఫీ చేయాలి. అలాగే ఎకరాకు తగినంత ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం అందించాలి.

ప్రభుత్వం స్పందించి ఈ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే మండలవ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు (జుuఖ) మండల అధ్యక్షుడు రంగస్వామి, నాయకులు ఈశ్వరప్ప, బెన్ని మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# మంత్రాలయంలో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- రోజు వందలాది ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు శూన్యం
- నెల మామూళ్లు ఇవ్వనందుకే పట్టుకున్నారా?
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు..!

**మంత్రాలయం, జూలై 20,ప్రభ మనం న్యూస్ :** మంత్రాలయంలో తుంగభద్ర నది సాక్షిగా ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నదీ గర్భం నుండి అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. స్థానిక పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**డంపింగ్ యార్డులుగా నదీ తీర ప్రాంతాలు**



అక్రమార్కులు కేవలం ఇసుకను తరలించడమే కాకుండా, నదీ తీరంలోని నిర్మానుష్య ప్రాంతాలను అక్రమ డంపింగ్ యార్డులుగా మార్చుకున్నారు. పగటిపూట ట్రాక్టర్లతో ఇసుకను అక్కడికి చేర్చి నిల్వ ఉంచుతున్నారు. అనంతరం చీకటి పడగానే భారీ టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. న్సిలింగ్' పేరిట వింత సమర్థన! ఇటీవల కాలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సుమారు 8 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నప్పటికీ, కొద్దిసేపటికే వాటిని వదిలేయడం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా... "వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపాం" అని సమాధానమివ్వడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ రవాణాకు పాల్పడిన వాహనాలపై కనీసం చట్టపరమైన కేసులు నమోదు చేయకపోగా, ఫైన్లు కూడా విధించకుండా కేవలం 'కౌన్సిలింగ్' పేరుతో వదిలేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**నెల మామూళ్లు' ఇస్తే సరే... లేదంటేనే కేసులు!**

మంత్రాలయంలో ప్రధానంగా అధికార టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఈ ఇసుక దందాను నడిపిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైతే అధికారులకు 'నెల మామూళ్లు' చెల్లించరో, వారి ట్రాక్టర్లను మాత్రమే పట్టుకొని హంగామా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మామూళ్లు చెల్లించే వారి వాహనాలు అధికారుల కళ్లముందే యాదేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా, పట్టుకునే సమయంలోనూ వాటిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రవిత్రమైన తుంగభద్రా నది పర్యావరణాన్ని నాశనం చేస్తూ, ప్రభుత్వ రాబడికి గండి కొడుతున్న ఈ అక్రమ ఇసుక దందాపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. మంత్రాలయంలో కంటితుడుపు చర్యలు కాకుండా, అక్రమ రవాణాకు బాధ్యులైన వారిపై మరియు వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రెవిన్యూ సంఘంలో సెక్రటరీ బాధ్యతలు చేపట్టిన వలిబాష

పెద్దకడబూరు మండల తహసీల్దార్ కు సెక్రటరీ భాధ్యతలు

వైస్ ప్రెసిడెంట్ ఆర్ ఐ.జెర్మియా

ఎగ్జిక్యూటివ్ మెంబెర్ జూనియర్ అసిస్టెంట్ బి.శ్రీనివాసులు

రెవెన్యూ సంఘంలో బాధ్యతలు స్వీకరించడంతో డీలర్లు ఘనంగా సన్మానం




**పెద్దకడబూరు జులై 20 : ప్రభ మనం:** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ -- ఆదోని డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు -- 2026--2029 కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆదోని డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగిన ఆదోని రెవెన్యూ భవన్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి డి. నిజాముద్దీన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయిని పెద్దకడబూరు మండల తహసీల్దార్ వలిబాష సోమవారం విలేకరులకు తెలిపారు. నూతనంగా సెక్రటరీ గా ఎన్నికైన తహసీల్దార్ వలిబాషకు,వైస్ ప్రెసిడెంట్ జెర్మియ,ఎగ్జిక్యూటివ్ నెంబర్ జూనియర్ అసిస్టెంట్ బి.శ్రీనివాసులుకు డీలర్లు దశరథ్ రాముడు,బిసి.నరసప్ప,గుమ్మల ఆశప్ప, రాముడు,రామన్న,వెంకటేష్, నాగప్ప, కమ్మలదిన్నె తాయన్న,వివిధ గ్రామాల డీలర్లు శాలువా పులుమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ఎన్నికల్లో పలు పదవులకు పోటీ జరగగా,మిగిలిన పదవులకు ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి 2026--2029 పదవీకాలానికి నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు.

**నూతన ప్రెసిడెంట్:** రజినీకాంత్ రెడ్డి ( తహశీల్దార్,కౌతాళం)

**అసోసియేట్ ప్రెసిడెంట్:** జె.బాబు( డిప్యూటీ తహసీల్దార్ ఆదోని ) సెక్రటరీ : వలిబాష ( తహసీల్దార్ పెద్దకడుబురు) ట్రెజరర్: రాఘవేంద్ర,వైస్ ప్రెసిడెంట్స్ జెర్మియా ఎన్నికోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం,సేవా సమస్యల పరిష్కారం,శాఖాభివృద్ధి,ఉద్యోగుల ఐక్యతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దకడబూరు మండలం డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

# బోయ వాల్మీకి సమాజానికి షెడ్యూల్డ్ ట్రైబ్ హోదా పునరుద్ధరణ చేయాలి: బోయ వాల్మీకి సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మారెళ్ళ తలారి అంజి

పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి



**తుగ్గలి జులై 20 ( ప్రభ మనం,న్యూస్):** బోయ వాల్మీకి సమాజానికి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా పునరుద్ధరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుని, జరుగబోయే పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని బోయ వాల్మీకి సమితి (బీవీఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మారెళ్ళ తలారి అంజి డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, సమాన హక్కుల స్ఫూర్తికి అనుగుణంగా బోయ వాల్మీకి సమాజానికి ఎస్టీ హోదా పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రకంగా, సామాజికంగా, జీవన విధాన పరంగా గిరిజన లక్షణాలు కలిగిన బోయ వాల్మీకి సమాజం ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్తున్నప్పటికీ ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బోయ వాల్మీకి సమాజానికి ఎస్టీ హోదా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని, ఆ తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా బోయ వాల్మీకి సమాజం న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి, పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్టీ హోదా పునరుద్ధరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మారెళ్ళ తలారి అంజి విజ్ఞప్తి చేశారు. బోయ వాల్మీకి సమాజానికి న్యాయం జరిగే వరకు బోయ వాల్మీకి సమితి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# వర్షాలు లేక ట్యాంకర్లతో నీరు తెప్పించి టమోటా సాగు.. ఎద్దులదొడ్డి రైతుల దుస్థితి

అప్పులు చేసి సాగు మొదలు.. వాన కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూపులు




**తుగ్గలి, జూలై 20 (ప్రభామనం,న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని ఎద్దులదొడ్డి గ్రామంలో వర్షాభావ పరిస్థితులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో టమోటా సాగు చేపట్టేందుకు సిద్ధమైన రైతులు, వర్షాలు కురవకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని పొలాలకు తెప్పించి మొక్కలు నాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులతో అప్పులపాలైన రైతులు, మరోవైపు ట్యాంకర్లకు వేల రూపాయలు వెచ్చిస్తూ సాగును కొనసాగిస్తున్నారు. వర్షాలు పడితే సహజంగా లభించే నీటి కోసం ఇప్పుడు అదనపు ఖర్చు చేయాల్సి రావడం రైతులకు పెనుభారంగా మారింది. టమోటా మొక్కలు ఎండిపోకుండా ఉండాలనే ఆశతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లోనే శ్రమిస్తున్నారు. కానీ ప్రకృతి సహకరించకపోవడంతో పెట్టుబడి తిరిగి వస్తుందో లేదో అనే ఆందోళన వారిని వెంటాడుతోంది. పంట బాగా పండితేనే అప్పులు తీర్చగలమనే ఆశతో రైతులు కష్టపడుతుండగా, వర్షాలు లేకపోవడం వారి ఆశలపై నీళ్లు చల్లినట్లుగా మారింది. వెంటనే ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులను గుర్తించి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటి సహాయక చర్యలు చేపట్టాలని ఎద్దులదొడ్డి గ్రామ రైతులు కోరుతున్నారు. రైతు కష్టానికి తగిన ఫలితం దక్కాలంటే ప్రకృతి కరుణతో పాటు ప్రభుత్వ మద్దతు కూడా అవసరమని వారు వేదన వ్యక్తం చేస్తున్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారం



**మంత్రాలయం , జూలై 20,మనం న్యూస్ ;** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లోని రాఘవేంద్రపురం కాలనీలో తాగునీటి సమస్య ను పరిష్కరించినట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు , ఎంపిటిసి మేకల వెంకటేష్ అన్నారు. సోమవారం కాలనీ లో పై భాగంలో ఉన్న ఇండ్లకు కొత్త బోర్ మోటార్ ఏర్పాటు చేసి కాలనీ వాసులకు తాగునీరు ను సరఫరా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా రాఘవేంద్రపురం కాలనీలో నీటి సమస్య ఉందని కాలనీ వాసులు మా దృష్టికి తీసుకువచ్చారని , ఈ తాగునీటి సమస్యను మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి దృష్టి కి తీసుకువెళ్ళడం జరిగిందని , స్పందించిన ఆయన వెంటనే కాలనీ లో బోర్ వేయించడం జరిగిందన్నారు. దీంతో కాలనీ వాసులు టీడీపీ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి కి , స్థానిక టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో ఉపేంద్ర రెడ్డి , టీడీపీ మండల సెక్రటరీ కమ్మసాలి నరసింహ , టీడీపీ నాయకులు మద్రి రఘు , పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# కోసిగి ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ స్టేషన్ లో పని చేస్తున్నా ఇద్దరు కానిస్టేబుల్స్ కు హెడ్-కానిస్టేబుల్లుగా పదోన్నతి



**కోసిగి,ప్రభ మనం, జూలై 20,:** మండల కేంద్రమైనా కోసిగి ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ స్టేషన్ నందు పనిచేస్తున్న ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ కానిస్టేబుల్లు ఈ. మునీరంగడు మరియు కే.తిక్కయ్య ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ హెడ్- కానిస్టేబుల్లుగా పదోన్నతి పొందడం జరిగింది. ఈ. మునీరంగడు ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ హెడ్- కానిస్టేబుల్ గా కోసిగి స్టేషన్ కు కేటాయించబడి డ్యూటీకి రిపోర్ట్ చేయడం జరిగింది. కే.తిక్కయ్య ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ హెడ్- కానిస్టేబుల్ గా నంద్యాల జిల్లా బనగానపల్లి ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ స్టేషన్ కు ప్రమోషన్ పై బదిలీ అయినట్లు, కోసిగి ప్రొహిబిషన్ ఊ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.భార్గవ రెడ్డి గారు తెలిపారు. ఎన్నో ఏళ్ళ సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పదోన్నతి పొందినందుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 130 ఫిర్యాదులు.



**కర్నూలు ప్రతినిధి. జులై 20,ప్రభ మనం:** కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ గారి క్యాంపు కార్యాలయంలో, కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం మొత్తం 130 ఫిర్యాదులు అందాయి. కర్నూలు గాయత్రి ఎస్టేట్ కు చెందిన ఒక మెడికల్ షాప్ యజమాని మా మెడికల్ ఎజెన్సీ నుండి మందులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసున్నాడని కర్నూలు కొత్తపేటకు చెందిన రాజు ఫిర్యాదు చేశారు. కర్నూలు మాధవి నగర్ లో ఉండే నా అల్లుడు రాజేష్ కుమార్ రెడ్డి కోర్టు విచారణలో ఉన్న ముగ్గురు సాక్షులను బెదిరిస్తున్నాడని ప్రాణ రక్షణ కల్పించాలని కర్నూలు , వెంకటరమణ కాలనీ కి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. పొలంలో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం, నల్లచెల్లిమల గ్రామానికి చెందిన ప్రమీల ఫిర్యాదు చేశారు. నా కొడుకు , కోడలు చూసుకోవడం లేదని అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్నూల్, నాగప్ప వీధి కి చెందిన ఈశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఉన్న ఏడు సంచుల వరి బియ్యం ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని నేను, నా పిల్లలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని న్యాయం చేయాలని సి . బెలగల్ మండలం, ముడుమాల గ్రామానికి చెందిన జయమ్మ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీ శివశంకర్, శ్రీ రామాంజులు, శ్రీ మస్తాన్ వలి పాల్గొన్నారు.

